ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.5 । కనిష్ఠం 21.7



కామారెడ్డి జిల్లా వార్తలు

3

శుక్రవారం 4 అక్టోబరు 2024

పంపిణీకి శనగ విత్తనాలు సిద్ధం

మద్నూర్, అక్టోబరు 3: ఉమ్మడి మద్నూర్ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో విత్తులు వేయడానికి శనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మద్నూర్ సింగిల్ విండో కార్యదర్శి బాబురావు తెలిపారు. మండల కేంద్రంలోని సింగిల్ విండో గోదాముల్లో నిల్వ చేసి ఉంచినట్లు వెల్లడించారు. 25 కేజీల బస్తాను రూ.2250 రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు సొసైటీకి వచ్చి శనగ విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రతీ కొనుగోలు కేంద్రానికి ఒక సీరియల్ నెంబర్ కేటాయించాలి
- సన్న, దొడ్డు రకాల ధాన్యానికి వేర్వేరు కాంటాల ఏర్పాటు
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ఏర్పాటు, డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్, అపాయింట్‌మెంట్ ఆర్డర్ల ప్రక్రియపై సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సంబంధించి జిల్లాలో పటిష్ఠ కార్యాచరణ తీసుకోవాలన్నారు. 7 వేలకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గతానికి భిన్నంగా ఈ సీజన్ నుంచి సన్నరకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కౌంటర్‌లు, కాంటాలు ఏర్పాటే చేయాలని సీఎం అన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రానికి ఒక సీరియల్ నెంబర్ ఏర్పాటు చేయాలని రైస్‌మిల్లులకు తరలించే ధాన్యం బస్తాలపై సీరియల్ నెంబర్ వేయాలన్నారు.

22వ ప్యాకేజీ పనులపై సీఎం ఆరా



యాచారంలో 22వ ప్యాకేజీ సొరంగమార్గం పనులు

- ఇటీవల జలసౌదలో ఇరిగేషన్ అధికారులతో సీఎం సమీక్ష
- ప్యాకేజీ పనుల భూసేకరణకు నిధులు విడుదల చేయాలని ఆదేశాలు
- ఇప్పటికే 267 ఎకరాల్లో పూర్తి అయిన భూసేకరణ
- భూ సేకరణకు రూ.18 కోట్లు ఇవ్వాలని ఆదేశించిన సీఎం
- కొండెం చెరువు రిజర్వాయర్ ఎత్తు తగ్గించాలని ఆదేశాలు
- జిల్లాలో నిధులు లేక ముందుకు కదలని 22వ ప్యాకేజీ పనులు

కామారెడ్డి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నిజామబాద్ జిల్లాలో సంవత్సరాల తరబడి కొనసాగుతున్న 21, 22వ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు ఇటీవల హైదరాబాద్‌లో జలసౌదలో ఈ ఎత్తిపోతల ప్యాకేజీ పనులపై రాష్ట్రస్థాయి నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో పాటు ఉమ్మడి జిల్లా అధికారులతో సీఎం సమీక్షించారు. ప్యాకేజీ పనులను త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ జిల్లాలో 21వ ప్యాకేజీ కింద చేపడుతున్న కొండెం చెరువు రిజర్వాయర్ నిర్మాణంతో స్థానిక ప్రజలు, రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీంతో ఆ రిజర్వాయర్ ఎత్తు తగ్గించాలని సీఎం అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కామారెడ్డి జిల్లాలో 22వ ప్యాకేజీ కింద కొనసాగుతున్న పనుల్లో భాగంగా భూసేకరణకు రూ.18 కోట్లు వెంటనే విడుదల చేయాలని సీఎం నీటి పారుదలశాఖ ఉన్నాతాధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాలతోనైన నిధుల మంజూరై ప్యాకేజీ పనులు పరుగులు పెడుతుందోలేదో చూడాలి.

కొండెం చెరువు రిజర్వాయర్ ఎత్తు తగ్గించండి

అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉన్నప్పుడు 20, 21, 22 ప్యాకేజీ పనులను రూపొందించారు. నిజామాబాద్ జిల్లాలో 20, 21 ప్యాకేజీ పనుల కింద పనులు చేపడుతుండగా కామారెడ్డిలో 22 ప్యాకేజీ పనులు కొనసాగుతున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి నీటిని ఎత్తిపోసి ఈ ప్యాకేజీల ద్వారా 2.40 లక్షల ఎకారాలకు సాగునీరు అందించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రీడిజైన్ చేసింది. అయితే నిజామాబాద్ జిల్లాలోని మొపాల్ మండలంలో 21వ ప్యాకేజీ పనులు కొనసాగుతున్నాయి. ఇక్కడ కొండెం చెరువు రిజర్వాయర్‌ను 3.5 టీఎంసీలో నిర్మించాలని నిర్ణయించింది. ఈ రిజర్వాయర్ నిర్మాణంతో వందలాది ఎకారాలు నీట మునగడమే కాకుండా పదుల సంఖ్యలో తండాలు, గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని స్థానిక ప్రజలు, రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీంతో పనులు పెండింగ్‌లో పడుతూ వచ్చాయి. ఈ సమస్యను గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి కొండెం చెరువు రిజర్వాయర్ ఎత్తును తగ్గించాలని సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఆదేశించారు.

22వ ప్యాకేజీ పనుల భూసేకరణకు రూ.18 కోట్లు మంజూరు

కామారెడ్డి జిల్లాలో 22వ ప్యాకేజీ ఎత్తిపోతల పనుల్లో భాగంగా కాల్వల నిర్మాణానికి, భూసేకరణకు రూ. 18 కోట్లు వెంటనే మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నీటి పారుదలశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 22 ప్యాకేజీ పనుల్లో భాగంగా కాల్వల నిర్మాణానికి ప్రధానంగా భూసేకరణ సమస్య ఎదురవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా పలు రిజర్వాయర్ల నిర్మాణంతో పాటు కాల్వల నిర్మాణానికి 2.921 ఎకారాలు భూసేకరణ కావలసి ఉంది. అయితే ఇప్పటి వరకు 1.239 ఎకారాల భూసేకరణ చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. తాడ్వాయి, సదాశివనగర్, రాజాంపేట, రామారెడ్డి మండలాల్లోని పలు గ్రామాల్లో 267 ఎకరాల భూసేకరణకు రైతులతో ఒప్పందం పూర్తయినప్పటికీ నిధుల లేమీతో పనులు ముందుకు సాగలేదు. ఇదే విషయాన్ని జిల్లా ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్యాకేజీ పనులపై హైదరాబాద్‌లోని జలసౌదలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి 22వ ప్యాకేజీ పనులకు సంబంధించి భూ సేకరణకు రూ.18 కోట్లు విడుదల చేయాలని అధికారులను అదేశించారు.

పెండింగ్‌లో రూ. 28 కోట్ల బకాయిలు

కామారెడ్డి, మెదక్ జిల్లాల్లోని బీడు భూములను సాగు భూములుగా మార్చేందుకు చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా 22వ ప్యాకేజీ పనులు గత 20 ఏళ్లగా కొనసాగుతునే ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా ఇరు జిల్లాలకు లక్షల ఎరాకాల్లో సాగు నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సదాశివనగర్ వద్ద భూంపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టగా యాచారం వద్ద సొరంగమార్గ పనులు ఎక్కడికక్కడే ఉన్నాయి. గతంలో సొరంగం పనులు, భూంపల్లి రిజర్వాయర్‌తో పాటు కాల్వల తవ్వకాల పనులు జరిగినప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్‌లు పనులు నిలిపివేశారు. కాంట్రాక్టర్‌లకు రూ.18 కోట్లు బకాయిలు పెండింగ్ ఉండగా సంబంధిత ఏజెన్సీలకు రూ. మరో 10 కోట్లు బకాయిల పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. సుమారు ఏడాదిన్నరగా ఈ బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్‌లు పనులు చేపట్టడం లేదు. ఇలా ప్యాకేజీ పనులకు సంబంధించి రూ.28 కోట్లు బిల్లుల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.



భూంపల్లి రిజర్వాయర్ నుంచి తవ్వకాలు జరిపిన ప్రధాన కాలువ

కుటుంబ సర్వేను పక్కాగా నిర్వహించాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

కామారెడ్డి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : ఇంటింటి కుటుంబ సర్వే పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని వార్డు నెంబర్ 6లో కుటుంబ సర్వే పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపడుతున్న ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. జిల్లాలోని మున్సిపల్ గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే పనులు టీంల ద్వారా ఈనెల 7 వరకు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, మున్సిపల్ కమిషనర్ సుజాత, టీం సభ్యులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువ పత్రాలను క్షణ్ణంగా పరిశీలించాలి

డీఎస్సీలో క్వాలీఫై అయిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన తీరును గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,240 మంది అభ్యర్థులు క్వాలీఫై అయ్యారని ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అందరి ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్నామన్నారు. అక్టోబరు 5లోగా పరిశీలన పూర్తి చేసేలా 10 టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట డీఈవో రాజు తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 356 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 356 ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్వింటాల్ ధాన్యానికి కనీస మద్దతు ధర గ్రేడ్ ఏ రకానికి రూ. 2,320, కామన్ రకానికి రూ. 2300, సన్న వడ్లు విక్రయించే రైతులకు అదనంగా క్వింటాల్‌కు రూ. 500 ఇవ్వనున్నట్లు తెలిపారు. టోల్‌ఫ్రీ నెంబర్ 08468-220051 ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఎల్లారెడ్డి మున్సిపల్ కాంగ్రెస్ కైవసం

- మున్సిపల్ చైర్మన్‌గా పద్మ శ్రీకాంత్ ఎన్నిక
- చైర్మన్‌కు పూర్తి మద్దతు తెలిపిన ఎమ్మెల్యే మదన్‌మోహన్, 8 మంది కౌన్సిలర్లు
- గైర్హాజరైన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కామారెడ్డి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి)/ఎల్లారెడ్డి: జిల్లాలోని ఎల్లారెడ్డి మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఎల్లారెడ్డి మున్సిపల్ నూతన చైర్మన్‌గా పద్మ శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక ప్రక్రియను అధికారులు ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. మున్సిపల్ పాలకవర్గంలో మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉండగా ఇందులో గతంలో 9 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు చెందిన వారు. దీంతో గత నాలుగున్నర సంవత్సరాల కిందట ఎల్లారెడ్డి మున్సిపాల్ చైర్మన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన కుడుముల సత్యం ఎన్నికయ్యారు. ఇటీవల చోటు చేసకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా కాంగ్రెస్‌లో చేరుతూవచ్చారు. స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు చేస్తున్న అభివృద్ధికి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలకు 8 మంది కౌన్సిలర్లు ఇటీవల ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఇది వరకు ఉన్న చైర్మన్ సత్యంపై కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో సత్యం బలప్రదర్శన నిరూపించుకోకపోవడంతో పదవిని కోల్పోయారు. నూతన చైర్మన్ కోసం ఆర్డీవో మన్నె ప్రభాకర్, మున్సిపల్ అధికారులు నోటిఫికేషన్ వేశారు. గురువారం నూతన చైర్మన్‌ను మున్సిపల్ కార్యాలయంలో ఎన్నుకునే ప్రక్రియ నిర్వహించారు. మున్సిపాలిటీలోని 8 మంది కౌన్సిలర్లతో పాటు స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చైర్మన్‌గా పద్మ శ్రీకాంత్‌ను ఎన్నుకుంటూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీంతో చైర్మన్‌గా పద్మ శ్రీకాంత్ ఎన్నికైనట్లు ఎల్లారెడ్డి ఆర్డీవో, ప్రొసీడింగ్ అధికారి మన్నె ప్రభాకర్ ప్రకటించి నియమాక పత్రాన్ని అందజేశారు. చైర్మన్ ఎన్నిక ప్రక్రియకు బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు నూతన చైర్మన్‌ను అభినందించారు. మున్సిపల్ పాలకవర్గంలోని కౌన్సిలందరు అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి, చైర్మన్‌కు సహకరించాలని కోరారు. మున్సిపల్ పాలకవర్గ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి పట్టణం అభివృద్ధి పథంలో వెళ్లాలని ఎమ్మెల్యే కోరారు.



ఎల్లారెడ్డి నూతన మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



చైర్మన్ ఎన్నికలో హాజరైన ఎమ్మెల్యే మదన్‌మోహన్, కౌన్సిలర్లు



కౌన్సిలర్లతో ఎమ్మెల్యే..

నీటి వనరులను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు

● ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్, అక్టోబరు 3: సాగునీటి వనరులను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని, రాష్ట్రంలో హైడ్రా చేపట్టిన చర్యలకు రైతులు, ప్రజల మద్దతు ఉందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైడ్రా చేపడుతున్న చర్యలను వివరించారు. రైతులకు ఉపయోగపడే చెరువులు, సాగునీటి వనరులు ఆక్రమించి గత ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరించిందని ఆరోపించారు. చెరువుల ఆక్రమణల ద్వారా సాగునీరు అందక రైతులు ఆందోళన చెందిన సందర్భాలు అనేకం ఉన్నా.. కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి చెరువుల మధ్యలో కాలువలను ఆక్రమించి కట్టడం ద్వారా నీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు.

ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు


కమ్మర్‌పల్లిలో ముస్తాబైన ఆలయం


అమ్మవారిని సందర్శించుకున్న బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్

కమ్మర్‌పల్లి, అక్టోబరు 3: విజయదశమి పర్వ దినోత్సవాలను పురస్కరించుకుని గురువారం నుంచి ప్రారంభమైన దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కమ్మర్‌పల్లి మండలవ్యాప్తంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాలలో దుర్గామాత ప్రతిమలు భక్తిశ్రద్ధలు ప్రత్యేక పూజల మధ్య కొలువుదీరాయి.

భీమ్‌గల్ : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భీమ్‌గల్ పట్టణంలోని అంగడిబజార్ గీర్వాణి కమిటీ ఆధ్వర్యంలో గురువారం దుర్గాదేవిని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మండపాన్ని పువ్వులు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. అలాగే అయ్యప్పనగర్ కాలనీలో నూతనంగా దేవిని ప్రతిష్ఠించారు. బస్టాండ్ ప్రాంతం లోని హన్మాన్ ఆలయం నుంచి మహిళల మంగళహారతుల మధ్య, భాజాభజంత్రీలతో ఊరేగింపుగా అయ్యప్ప నగర్‌లో ఏర్పాటు చేసిన మండపానికి దేవిని తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేకపూజలు జరిపించారు. నందిగల్లీలో దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

బోధన్‌రూరల్: అమ్మవారి కృపకటాక్షాలు, చల్లని దయతో ప్రజలందరు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని బోధన్ మున్సిపల్‌చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని 25వ వార్డుతో పాటు పలు వార్డులలోని మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో సార్వజనిక్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను భక్తులు, ప్రజలు మండపాల సభ్యులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గురువారం రాత్రి గ్రామాల్లో దుర్గాదేవిని ఊరేగింపుగా మండపల వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మండపాల్లో దుర్గాదేవిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు గ్రామాల్లో దుర్గాదేవిని భక్తులు, మండపాల ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.

రెంజల్: మండలంలోని పలు గ్రామాలలో దుర్గామాతలు కొలువుదీరాయి. తొమ్మిది రోజుల పాటు కొలువుదీరిన అమ్మవారికి గురువారం గ్రామాలకు చేరుకున్న అమ్మవారి విగ్రహాలకు మహిళలు మంగళహారతులు, భాజాభజంత్రీల మధ్య స్వాగతం పలికి ప్రతిష్ఠించారు. మొదటి రోజు బాల త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు కొలువుదీరడంతో మాలధారణ ధరించిన స్వాములు, గ్రామస్థులు, మహిళలు మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాయల్లో అమ్మవారిని కొలుస్తారు.

మెండోర: మండలంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామాల్లో దుర్గాదేవి అమ్మవారి విగ్రహాలను మండపాల నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో పూజించి ప్రతిష్ఠించారు. మండల కేంద్రంలో కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా స్వామివారి పల్లకి సేవలను గ్రామ వీధులగుండా మంగళహారతులతో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మాలదారణ స్వాములు పాల్గొన్నారు.

ధర్పల్లి : మండలంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆయా మండపాల వద్ద దుర్గామాతను ఊరేగింపుగా భక్తిశ్రద్ధలతో తీసుకెళ్లి ప్రతిష్ఠించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు దుర్గామాత మాలాధారణ ధరించి నియమనిష్ఠలతో పూజలు చేస్తారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించి ఊర చెరువులో నిమజ్జనానికి ఏర్పాట్లు నిర్వహిస్తారు.

ముప్కాల్ : బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలను గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గామాత విగ్రహాలను శోభయాత్రగా తరలించి మండపాల్లో మంత్రోచ్చరణల మధ్య అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహి ళలు ఏకరూప వస్త్రాలతో అందంగా అలంకరించుకొని డప్పువాయిద్యాలు, సాంస్కృతిక నృత్యాలు, మహిళల మంగళహారతులతో ప్రధాన వీదులగుండా శోభయాత్రగా దుర్గామాతలను తీసుకువెళ్లారు.

డీజేలకు అనుమతి లేదు : ఏసీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ

రుద్రూరు, అక్టోబరు 3 : డీజేలకు అనుమతి లేదని, ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని ఏసీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం రుద్రూరు పోలీ స్‌స్టేషన్ ఆవరణలో రుద్రూరు, వర్ని, కోటగిరి మండలాల డీజే, దుర్గామాత మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తి శ్రద్దలతో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. దుర్గామాత మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలని కోరారు. ముఖ్యంగా డీజేలు, టపాసులను నిషేధించడం జరిగిందని, భక్తి శ్రద్దలతో నిమజ్జనం చేయాలన్నారు. నిమజ్జనాల సమయంలో నిర్వహించే ఊరేగింపులో వివాదాలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలను పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రతిఒక్కరు తమకు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో సీఐ జయేష్‌రెడ్డి, ఎస్సై సాయన్న, పోలీసు సిబ్బంది, డీజే, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

● ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దు

భీమ్‌గల్ : డీజే చప్పులతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణ కేంద్రంలోని సహస్ర ఫంక్షన్‌హాల్‌లో సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని డీజే నిర్వాహకులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పండగలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. సీపీ ఆదేశాలనుసారం డీజేలను నిషేధించడం జరిగిందని, డీజేలను పెట్టకూడదని, ఇట్టి నిబంధనను అతిక్రమిస్తే డీజే సీజ్ చేయడంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో భీమ్‌గల్ సీఐ నవీన్‌కుమార్, భీమ్‌గల్, ఏర్గట్ల, మోర్తాడ్ ఎస్సైలు మహేష్‌కుమార్, రాములు, విక్రం, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు ఇవ్వండి : అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దబజార్, అక్టోబరు 3: నగరంలోని 20, 16వ డివిజన్‌లలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి గురువారం ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ నీతూకిరణ్ పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా నగరంలోని కంఠేశ్వర్ బ్యాంక్ కాలనీలో 10లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమిపూజ చేయడం జరిగిందన్నారు. 16వ డివిజన్‌లో ఎంకే గార్డెన్ సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. నగర అభివృద్ధి సుందరీకరణకు తగిన నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పనుల కోసం స్పెషల్ ఫండ్ వంద కోట్లు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ న్యాలంరాజు, 16వ డివిజన్ కార్పొరేటర్ పంచరెడ్డి ప్రవళిక, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానిక బిజెపి నాయకులు పాల్గొన్నారు.

పనిలో పోటీతత్వం అలవాటు చేసుకోవాలి : సీపీ


డ్యూటీమీట్‌లో ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఖిల్లా, అక్టోబరు 3: పోలీసు శాఖలో విధులు నిర్వహించే ప్రతి సిబ్బంది పనిలో పోటీతత్వం అలవాటు చేసుకోవాలని పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌సింగనేవార్ అన్నారు. బాసర జోన్ పోలీసు సిబ్బందికి గురువారం డ్యూటీమీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు విధినిర్వహణలో సామర్థ్యం పెంచడానికి రాష్ట్రంలో మొద టిసారి నిర్వహిస్తున్న డ్యూటీమీట్‌ను కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల సిబ్బందికి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ద్వారా పోలీసు విభాగంలో కానిస్టేబుల్ స్థాయి నుంచి సీఐ స్థాయి వరకు పని పద్ధతులు మెరుగుపడి విచారణ స్థాయి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావ్, శంకర్‌నాయక్, ఏసీపీ లు నాగవేంద్రచారీ, రవీందర్‌రెడ్డి, డాక్టర్ నాగమోహన్, జోన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మూడోరోజు ఘనంగా సాగిన బతుకమ్మ


యూనివర్సిటీలో బతుకమ్మ సంబరాలు

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 3: మహిళలు ఎంతో సంబురంగా జరుపుకునే బతుకమ్మ వేడుకలు గురువారం అంబరాన్ని అంటాయి. జిల్లా వ్యాప్తంగా మూడవ రోజున అటుకుల బతుకమ్మ వేడుకలను అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. బతుకమ్మను వివిధ రకాల పూలతో రెండు అంతరాల్లో అమర్చి అందులో గౌరమ్మను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బతుకమ్మ చుట్టూ తిరుగుతూ తోటి మహిళలతో ఆటపాటలతో బతుకమ్మ ఆడారు. గౌరమ్మకు అటుకులను నైవేద్యంగా సమర్పించి ముత్తదువులకు వాయినాలు ఇచ్చుకున్నారు. అనంతరం బతుకమ్మను నీటిలో నిమజ్జనం చేశారు. జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయం, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, అయోధ్య రామాలయం, పెద్ద రాంమందిర్, హమాల్‌వాడి సాయిసంతోషి ఆలయం, చక్రంగుడి లక్ష్మివెంకటేశ్వర ఆలయం, నగరేశ్వర ఆలయం, తదితర ఆలయాల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు.

నేడు ముద్దపప్పు బతుకమ్మ...

బతుకమ్మ వేడుకల్లో మూడవ రోజున ముద్దపప్పు బతుకమ్మగా జరుపుకుంటారు. బతుకమ్మను మూడు అంతరాలలో పూలను పేర్చి అందులో గౌరమ్మను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నైవేద్యంగా అటుకులతో పాటు ముద్దపప్పుతో తయారు చేసిన పిండి వంటకాలను సమర్పించడంతో ఈ బతుకమ్మకు ముద్దపప్పు బతుకమ్మగా పూజిస్తారు.

డిచ్‌పల్లి : నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో గురువారం కంప్యూటర్ కళాశాల వద్ద బతుకమ్మ సంబరాలను అంబరాన్ని అంటే విధంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ యాదగిరి బతుకమ్మ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి, ప్రిన్సిపాల్ ఆరతి మాట్లాడుతూ తెలంగాణలోనే బతుకమ్మ పెద్ద పండుగ అని తెలంగాణ ఆడబిడ్డల సాంప్రదాయానికి సంస్కృతికి నిలువుటద్దంగా నిలుస్తుందన్నారు. బతుకమ్మ అంటే ప్రకృతిని ప్రేమించడమేనని తెలంగాణ ఆడబిడ్డల ప్రధాన ఆచారం అందరూ ఈ యేడాది బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం మహిళా ఉద్యోగులు, విద్యార్థినిలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దొంగ పాస్‌పోర్టు పొందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన ఢిల్లీ పోలీసులు

● పరారీలో మరో నిందితుడు

కామారెడ్డి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : తప్పుడు సర్టిఫికెట్‌లతో పాస్‌పోర్టు పొందిన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలానికి చెందిన ఓ వ్యక్తిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా పోలీసులు పేర్కొన్నారు. నిందితుడికి సహకరించిన మరో ఇద్దరిపై కూడా కేసు నమోదు చేశారు. వీరిపై పలుసెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. జిల్లా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామానికి చెందిన వాహబ్ మహమ్మద్ తప్పుడు సర్టిఫికెట్‌లతో తన పేరును అసన్ అబ్దుల్‌గా మార్చుకొని పాస్‌పోర్టు పొందాడు. ఆ పాస్‌పోర్టుపై ఇటీవల సౌదీకి వెళ్లాడు. సౌదీలో ఇమిగ్రేషన్ అధికారులకు పట్టుబడడంతో అతనిని తిరిగి ఇండియాకు పంపారు. అదేవిధంగా సౌదీ ఇమిగ్రేషన్ అధికారులకు భారత్ ఇమిగ్రేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఢిల్లీ విమానాశ్రయంలో నిందితుడు దిగగానే అక్కడి పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారణ జరిపారు. రెడ్డిపేటకు చెందిన శంకర్ నాయక్ సహాయంతో తప్పుడు ఎస్‌పోర్టు పొందినట్లు విచారణలో తేలగా గురువారం ఢిల్లీ పోలీసులు రెడ్డిపేటకు వచ్చి శంకర్‌నాయక్‌ను అరెస్టు చేసి తీసుకెళ్లారు. ఈ కేసులో కామారెడ్డి పట్టణానికి చెందిన మరొకరు ఉన్నారని ఆయన పరారీలో ఉన్నట్లు తెలిసింది.

అర్హులైన ప్రతీ కుటుంబానికి డిజిటల్ కార్డు

● బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో


లంగ్డాపూర్ సర్వేలో పాల్గొన్న సబ్‌కలెక్టర్

బోధన్‌రూరల్, అక్టోబరు 3 : అర్హులైన ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు అందజేస్తామని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం బోధన్ మండలంలోని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన లంగ్డాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన్‌నేషన్ వన్‌కార్డు కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతీ కుటుంబానికి డిజిటల్ కార్డులు అందజేస్తామన్నారు. లంగ్డాపూర్‌లో సర్వేను పరిశీలించారు. రేషన్, ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి స్కీమ్, ఇందిరమ్మ ఇళ్లు, ఇలా అన్ని కూడా డిజిటల్ కార్డులోనే పొందవచ్చన్నారు. ప్రజలు దళారుల మాటలు నమ్మవద్దన్నారు. ఏవైనా అనుమానాలుంటే ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారులను సంప్రదించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు తప్పకుండా అందుతాయన్నారు. అలాగే పట్టణంలోని 25వ వార్డులో డిజిటల్ కార్డుల సర్వేను పరిశీలించారు. ఈ సర్వే 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ కొనసాగుతుందని సబ్‌కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, తహసీల్దార్ విఠల్, ఎంపీడీవో బాల గంగాధర్, ఎంపీవో మధుకర్, కమిషనర్ వెంకట్ నారాయణ, పాషా మొయినోద్దీన్, గణపతిరెడ్డి, నాగేశ్వర్ రావు, మందర్నా రవి, కాంగ్రెస్ నాయకులున్నారు.

డిజిటల్ కార్డుల సర్వేను పరిశీలించిన ఆర్డీవో

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు 3: ఆర్మూర్ మండలం రాంపూర్ గ్రామంలో కుటుంబ డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియను గురువారం ఆర్డీవో రాజాగౌడ్ పరిశీలించారు. డిజిటల్‌కార్డు సర్వేను తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆర్డీవో వెంట డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీడీవో సాయిరాం, ఎంపీవో శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముప్ప గంగారెడ్డి

ఖిల్లా, అక్టోబరు 3 : వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముప్పగంగారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. గురువారం ఆయన కుటుంబసభ్యులు, పాలకవర్గ సభ్యులతో కలిసి కొత్తగా ఏర్పాటు చేసిన చైర్మన్ చాంబర్‌లో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సభ్యులను పరిచయం చేసుకుని వారిని సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి అపర్ణ ప్రభుత్వం జారీ చేసిన నియామక పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయనను శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభకాంక్షలు తెలిపారు.

పేదల ఇంటికి నెంబర్లు కేటాయించాలని ధర్నా

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు 3: నిరుపేదలు కట్టుకున్న ఇళ్లకు ఇంటి నెంబర్‌లను కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ బాబు అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిరుపేదలతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సుందరయ్యకాలనీలో గత ఎనిమిదేళ్లుగా ఇళ్లు కట్టుకొని జీవనం సాగిస్తున్న వారికి మౌలిక వసతులు కల్పించడంలేదని, ఇళ్ల పట్టాలు, ఇంటి నెంబర్‌లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, డి.రవి, భూమన్న, సాయిలు, ఓంకార్, నవీత్, కిషన్, రఫిక్ పాల్గొన్నారు.

ఆలూర్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గం

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు 3: ఆలూర్ మండల కేంద్రంలో గురువారం నూతన గ్రామాభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షునిగా బార్ల ముత్యంరెడ్డి, ఉపాధ్యక్షులుగా సంతోష్, నవనీత్, కోశాధికారులుగా గంగారెడ్డి, సుమన్, ప్రధాన కార్యదర్శులుగా రాములు, జాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ముత్యంరెడ్డి మాట్లాడుతూ అందరితో కలిసి కట్టుగా ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థి ఎంపిక

ముప్కాల్, అక్టోబరు 3: ఇటీవల నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ -17 తైక్వాండో విభాగంలో బాల్కొండ మోడల్ స్కూల్‌లో పదోతరగతి చదువుతున్న విద్యార్థిని పి.రవళిక ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 18, 19తేదీల్లో గజ్వేల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో రవళిక జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పీడీ ముత్తెన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సావెల్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభం

మెండోర, అక్టోబరు 3: మండలంలో సావెల్ గ్రామంలో పలు అభివృద్ధి పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సంద ర్భంగా గ్రామంలో రూ.37 లక్షల నిధులు మంజూరు చేసిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌కు గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో మురికికాలువల నిర్మాణం, సీసీరోడ్డు నిర్మాణం, హైమాక్స్ లైట్ల పనులు చేపడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ లత, కారోబార్ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు ప్రసాద్, లింగన్న, శ్రీనివాస్, సంతోష్, రాజ్‌కుమార్, గంగారెడ్డి, శ్రీనివాస్, రాజు, మహేష్, రాజేందర్ పాల్గొన్నారు.

బొలెరో వాహనం పట్టివేత

కోటగిరి,అక్టోబరు 3: మండల కేంద్రంలో గురువారం తెల్లవారుజామున ఇసుకను అక్రమంగా తరలిస్తున్న బోలేరో వాహనాన్ని తహసీల్దార్ గంగాధర్ పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు వాహనాన్ని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి జరిమానా విధించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాలో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



బాన్సువాడ సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ సలహాదారుడు పోచారం

కామారెడ్డిటౌన్, అక్టోబరు 3: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆయా ప్రాంతాల్లో గురువారం దుర్గమాత విగ్రహాలు వైభవంగా ప్రతిష్ఠించారు. నవరాత్రులు దుర్గాదేవికి పూజలు నిర్వహించడంతో పాటు డీజే నృత్యాలతో యువతీ, యువకులు సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే కామారెడ్డి పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా పెద్దమ్మను ఊరేగించారు.

దోమకొండ: మండలంలోని ఆయా గ్రామాలతో పాటు దోమకొండ మండల కేంద్రంలో గురువారం దుర్గమాత విగ్రహాలు ప్రతిష్ఠించారు.నవరాత్రులు దుర్గాదేవికి పూజలు నిర్వహించడంతో పాటు డీజే నృత్యాలతో యువతీ, యువకులు సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. అమ్మవారి మండలపాలను అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. విద్యుద్దీపాలతో ముస్తాబుచేశారు. మండపాల్లో మహిళలు పూజలు నిర్వహించారు.యువకులు నవరాత్రుల్లో భాగంగా దుర్గమాత మాలలు ధరించారు.

బాన్సువాడ: పట్టణంలోని జ్ఞాన సరస్వతి దేవి ఆలయంలో గురువారం నిర్వహించిన దేవి శరన్నవరాత్రి ప్రారంభ ఉత్సవాలలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. మొదటి రోజు గురువారం అమ్మవారు స్వర్ణ కవచలం కృత దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పోచారం శంభురెడ్డి పాల్గొన్నారు.

బీర్కూర్: మండలంలో శరన్నవరాత్రులు గురువారం ఘనంగా ప్రారంభ మయ్యాయి. దుర్గామాత విగ్రహాలను శోభాయాత్రగా తరలించి మండపాల్లో ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు, యువకులు అమ్మవారి మాల దరించి ఉపవాస దీక్షలు చేపట్టారు.

● ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎంపీపీ

నిజాంసాగర్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు దుర్గామాత అమ్మవారు బాల త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నిజాంసాగర్ మండలంలోని గోరుగల్ గ్రామంలో అంగరంగ వైభవంగా దుర్గామాతను మండపంలో కొలువు తీర్చగా నిర్వాహకులు దుర్గామాత మాలధారణ వేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు సంజీవరావు ప్రత్యేక పూజలు నిర్వహించగా మాజీ ఎంపీపీ పటోళ్ల జ్యోతి దుర్గారెడ్డి దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 9 రోజుల పాటు మండపంలో ప్రత్యేక పూజలు ప్రతీరోజు ఒక్కో అవతారంలో మాతా దర్శనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

మహ్మద్‌నగర్‌లో..

నిజాంసాగర్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత కొలువు దీరింది. మహ్మద్ నగర్ మండల కేంద్రంలో వేద పండితులు సంజీవరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు కనకదుర్గ భవాని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు దఫెదారి విజయ్, ప్రకాష్, ప్రవీణ్, గోవింద్, శ్యామ్ స్వామిగౌడ్, వికాస్‌గౌడ్, కంట్రపల్లి రాజు తదితరులు ఉన్నారు.

మద్నూర్: నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఉమ్మడి మద్నూర్ మండలంలో పలువురు యువకులు దేవి మాతా దీక్షలను తీసుకున్నారు. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉమ్మడి మద్నూర్ మండలంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మండలకేంద్రం తో పాటు ఆయా గ్రామాలలో దుర్గా మాత విగ్రహాలను భక్తులు ప్రతిష్ఠించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో పలువురు దుర్గామాత భక్తులు, దేవి భవాని దీక్షలను తీసుకున్నారు. వారం రోజుల పాటు ప్రత్యేక దుస్తులతో పూజా కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. దుర్గామాత దీక్షలో చిన్న పిల్లల నుంచి మహిళలు, యువకులు దీక్ష తీసుకోవడంపై గ్రామంలో ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సనాతన మార్గం వైపు ప్రతీఒక్కరు వెళ్లే విధంగా దీక్ష ఆచరించాలని ఆచార్యులు తెలిపారు.



బీర్కూర్‌లో మండపంలో దుర్గామాతను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దీక్ష తీసుకున్న యువకులు

బోనస్ పేరిట బోగస్ మాటలు

- ● ఆరు గ్యారంటీలు నీటి మూటలే..
- ● లింగంపేటలో రుణమాఫీ కొంత మందికే..
- ● మాజీ ఎమ్మెల్యే సురేందర్



లింగంపేటలో ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై రైతుల ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

లింగంపేట, అక్టోబరు 3: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజకు రూ.500 బోనస్ చెల్లించి కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్ సర్కార్ ఇప్పుడు మాట మార్చి కేవలం ఎంపిక చేసిన సన్నరకం ధాన్యానికి మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని బోగస్ మాటలు చెబుతుందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఆయన గురువారం లింగంపేట మండల కేంద్రంలో ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై రైతు లందరికి రూ. 2లక్షల రుణ మాఫీ చేయాలని నిర్వహించిన రైతు మహా ధర్నాలో పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 100రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన రేవంత్ సర్కార్ 303 రోజులు పూర్తయిన నేటి ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని ఆయన విమర్శించారు. లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో గల 3972మంది రైతులు పంట రుణాలు తీసుకోగా కేవలం 1400 మంది రైతు లకు రూ.5కోట్లు మాత్రమే రుణమాఫీ జరిగిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిందని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ దవఖానాల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో పాటు మందులు లేక ప్రజలు చనిపోతుంటే పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆయన తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ హయంలోనే హైదరాబాద్‌కు రాష్ట్రంలోని ఆయా గ్రామాలలోని పేదలు బతుకు దెరువు కోసం వలసలు వచ్చి మూసి పరివాహక ప్రాంతాల్లో నివాస గృహాలు నిర్మాణం చేసుకున్నారని అరోజు అడ్డుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు హైడ్రా పేరుతో పేదల బతుకులు చిత్రం చేస్తూ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. మూసీ శుభ్రం చేయ డానికి రూ.లక్ష50వేల కోట్లు వృధా ఖర్చు అని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డిల్లీకి సంచులు, సద్దులు మోస్తున్నారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ 10సంవత్సరాల పాలనలో రైతులు ఒక్కరోజు కూడా రోడ్డెక్కలేదని కేవలం కాంగ్రెస్ 10 నెలల కాలంలోనే రైతులు రోడ్డున పడ్డారని ఆయన అన్నారు. పంట సాగు చేస్తున్న రైతులకు పంట చేతికి వస్తున్నప్పటికీ రైతు భరోసా అందించకుండా రూ.15వేలు ఇస్తామని ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం తహసీల్దార్ నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంపత్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు రమేష్, డీసీఎంఎస్ డెరెక్టర్ కపిల్‌రెడ్డి, మాజి ఎంపీపీ సాయిలు, నల్లమడుగు సొసైటీ డైరెక్టర్లు నర్సింలు, మాజి ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గన్నునాయక్, సర్వన్, శ్రీకాంత్, బండి నర్సింలు, అశోక్‌రెడ్డి, సంగమేశ్వర్, సాయాగౌడ్, యూసూఫ్‌తో పాటు రైతులు ఉన్నారు.

అచ్చయ్యపల్లిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రారంభం



అచ్చయ్యపల్లిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్

నాగిరెడ్డిపేట, అక్టోబరు 3: మండలంలోని అచ్చయ్యపల్లి గ్రామ పంచాయతీలో గురువారం ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను ప్రారంభించినట్లు ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కోసం మండలంలోని అచ్చయ్యపల్లి గ్రామ పంచాయతీ పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైనట్లు తెలిపారు. దీంతో అచ్చయ్యపల్లి గ్రామంలో గురువారం నుంచి అధికారుల బృందం ఇంటింటి తిరుగుతూ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే జరుపుతున్నట్లు తెలిపారు. అచ్చయ్యపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో అచ్చయ్యపల్లి గ్రామంతో పాటు రామక్కపల్లి గ్రామం ఉందన్నారు. ఈ గ్రామపంచాయితీ పరిధిలో 182 కుటుంబాలు ఉన్నట్లు తెలిపారు. అచ్చయ్యపల్లి గ్రామంలో 98 కుటుంబాలు, రామక్కపల్లి గ్రామంలో 84 కుటుంబాలున్నట్లు తెలిపారు. గురువారం నుంచి ప్రారంభమైన ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే ఈ నెల 7వ తేదీ వరకు ఐదు రోజుల పాటు కొనసాగుతుందని ఆయన తెలిపారు. సర్వే అనంతరం ప్రభుత్వానికి సర్వే నివేదిక సమర్పించ నున్నట్లు తెలిపారు. అచ్చయ్యపల్లి గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డును సర్వేను ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్ పరిశీలించారు. సర్వే జరపడంలో ఎలాంటి లోపాలు లేకుండా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సర్వే కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్‌చారి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఆర్ఐ మహ్మద్, మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు మల్లికార్జున్, తిరుపతి, వెంకట్, రాములు, రమేష్, రవీందర్, నరేందర్, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్, ఆశ వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

భిక్కనూర్, అక్టోబరు 3: భిక్కనూరు మండల కేంద్రంలో ఒకరు జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై-2 రాంచంద్రనాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంధం కేశయ్య(40)కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో గురువారం తెల్లవారుజామున ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు

టెక్నికల్ అసిస్టెంట్ మృతి పట్ల నివాళులు

దోమకొండ, అక్టోబరు 3: మచారెడ్డి మండలంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ జైల్‌సింగ్ నాయక్ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో గురువారం దోమకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సిబ్బందితో కలసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబానికి భగవంతుడు ధైర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రజిని, మాణిక్యరావు, శ్రీకాంత్, రాజేశ్వర్, లింగం తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో నివాళులు అర్పిస్తున్న అధికారులు

పోగొట్టుకున్న మొబైల్స్‌ను బాధితులకు అందజేత



ఫోన్‌లను బాధితులకు అందజేస్తున్న ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 3: కామారెడ్డి పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మొబైల్ రికవరీ మేళాలో జిల్లా ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ దొంగలించబడిన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరి కోసం గత నెల రోజుల క్రితం జిల్లాలో స్పెషల్ టీంను ఏర్పాటు చేసి ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇప్పటి వరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 2020 సెల్‌ఫోన్‌లను గుర్తించి బాధితులకు అందించామన్నారు. ఇందులో స్పెషల్ టీంల ద్వారా 152 సెల్‌ఫోన్‌లను రికవరి చేయడం జరిగిందని, వీటి విలువ రూ20లక్షల వరకు ఉంటుందని వాటిని గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు అందజేశామన్నారు.

బోరుమోటార్ ప్రారంభం

కామారెడ్డిటౌన్, అక్టోబరు 3: పట్టణంలోని 49వ వార్డులో నూతన బోరుమోటర్‌ను గురువారం మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. వార్డులో నీటి సమస్య ఉందని కాలనీవాసులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి వెంటనే బోరు వేయించి ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున ప్రతీ ఒక్కరు ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రత పాటించాలన్నారు.



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులను సన్మానిస్తున్న యువత

'క్రీడలతో మానసిక ఉల్లాసం'

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 3: క్రీడలతో మానసిక ఉల్లాసం శారీరక ధృడత్వం కలుగుతుందని, అటువంటి క్రీడా పోటీలు నిర్వహించినప్పుడు గెలుపు ఓటములు సహజమని జుక్కల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అస్పత్‌వార్ వినోద్ పేర్కొన్నారు. గురువారం పెద్ద ఏడ్గి గ్రామ యువత ఆధ్వర్యంలో ఏడ్గి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం సెలవుల కాలంలో యువత కోసం క్రికెట్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అయితే క్రీడా పోటీల్లో ఎంత మంది పాల్గొన్నా విజేతగా ఒక టీం మాత్రమే ఉంటుందని తెలిపారు. క్రీడల్లో ఓటమి పాలయిన జట్టు సభ్యులు నిరాశకు గురికాకుండా విజయం కోసం ప్రయత్నించాలని సూచించారు. అనంతరం యువత సభ్యులు క్రికెట్ పోటీలు ప్రారంభించిన నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, పడంపల్లి మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని



పెద్దకొడప్‌గల్, అక్టోబరు 3: నారాయణపేట్ జిల్లాలో ఈ నెల 3 నుంచి 5 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు మండలంలోని వడ్లం పాఠశాలకు చెందిన సుజిత పయనమైంది. నిజామాబాద్ జిల్లా మంచిప్ప గ్రామంలో జరిగిన జిల్లా స్థాయి కుస్తీ పోటీలు అండర్-17లో 40 కిలోల విభాగంలో సుజిత ప్రథమ స్థానం సాధించడంతో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సుజిత నారాయణపేట్ వెళ్లింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో సుజిత విజయం సాధించాలని పాఠశాల సిబ్బందితో పాటు గ్రామస్థులు కోరుకున్నారు.

పోల్కంపేటలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు



పోల్కంపేటలో స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న డీఎల్‌పీవో

లింగంపేట, అక్టోబర్ 3 : మండలంలోని పోల్కంపేటలో స్వచ్ఛతాహీ సేవా ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా మహిళా సంఘాల ద్వారా గురువారం డీఎల్‌పీవో సురేందర్ స్టీల్ బ్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధులు వస్తాయని ఆయన తెలియజేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడం కోసం గ్రామంలో స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశామని వివాహాలు ఇతర వేడుకలకు ప్లాస్టిక్ కు బదులుగా స్టీల్ గ్లాసులు, ప్లేట్స్, కప్పులు ఉపయోగించాలని ఆయన తెలియజేశారు. స్టీల్ బ్యాంక్‌ను గ్రామ పంచాయతీ సహకారంతో మహిళా సంఘాలు నిర్వహిస్తాయని అందుకుగాను కొంత రెంట్‌ను చెల్లించి వస్తువులను తీసువెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, కార్యదర్శి అశ్వఖ్, ఐకేపీ సీసీ మన్సూర్, సీఏ నవ నీత మహిళా సంఘంలోని మహిళలు పాల్గొన్నారు.

డిజిటల్ రేషన్ కార్డు సర్వే పరిశీలన



లొంగన్‌లో డిజిటల్ కార్డు సర్వే చేస్తున్న ఎంపీడీవో బృందం

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 3: జుక్కల్ మండలంలోని లొంగన్ గ్రామంలో జరుగుతున్న డిజిటల్ రేషన్ కార్డుల సర్వేను గురువారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ కార్డులను డిజిటల్ కార్డులుగా రూపాంతరం చేస్తున్న తరుణంలో జిల్లాలోని నాలుగు గ్రామాలను ప్రభుత్వం పైలట్ గ్రామాలుగా ఎంపిక చేసిందని తెలిపారు. ఇందులో లొంగన్ గ్రామం ఒకటి కాగా, గ్రామంలో జరుగుతున్న డిజిటల్ సర్వేను పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఈ సర్వేలో కుటుంబ సభ్యుల నిర్ధారణతో పాటు ఈ యాప్‌కుటుంబ సభ్యుల వివరాలు లేని వారివి ఉంటే కూడా సర్వే సమయంలో చేర్చడం జరుగుతుందని తెలిపారు.

పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌కు ఘన స్వాగతం పలకాలి

● డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్

కామారెడ్డి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 3: పీసీసీ పదవిని చేపట్టి మొదటిసారిగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు వస్తున్న మహేష్ కుమార్‌గౌడ్‌కి ఘనస్వాగతం పలికేందుకు జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ అన్నారు. గురువారం కామారెడ్డి కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మొట్టమొదటి సారిగా జిల్లాకు వస్తున్న సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేష్ షెట్కర్ భిక్కనూర్ టోల్‌గేటు వద్ద గొప్ప సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

భిక్కనూరు: పీసీసీ పదవిని చేపట్టి మొదటిసారిగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు వస్తున్న మహేష్ కుమార్‌గౌడ్‌కి ఘనస్వాగతం పలికేందుకు మండలం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం భిక్కనూరులో మాట్లాడారు. టోల్‌ప్లాజా వద్ద జరిగే కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలన్నారు.

దోమకొండ,(బీబీపేట): పీసీసీ పదవిని చేపట్టి మొదటిసారిగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు వస్తున్న మహేష్ కుమార్‌గౌడ్‌కి ఘనస్వాగతం పలికేందుకు మండలం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కాంగ్రెస్ నాయకులు అంకన్నగారి నాగరాజ్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. భిక్కనూరు టోల్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

నిలిచిన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు



స్థానికులతో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డీఈ విజయ్ సారథి

నాగిరెడ్డిపేట, అక్టోబరు 3: జాతీయ రహదారి (ఎన్‌హెచ్765డీ) విస్తరణ పనుల్లో భాగంగా నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు పనులను నిలిపివేస్తున్నట్లు ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డీఈ విజయ్ సారథి తెలిపారు. మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం స్థానికులు రాస్తారోకో చేయడంతో విషయం తెలుసుకున్న స్థానికులు ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డీఈ విజయ్ సారథి గురువారం మండల కేంద్రానికి విచ్చేసి స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా 15 మీటర్ల దూరంలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, కొందరు పలుకుబడి దారుల భవనాల వద్ద 14 మీటర్లకే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని, మిగతా చోట్ల 15 మీటర్ల దూరంలోనే విద్యుత్ స్తంభాలుఏర్పాటు చేయడంలో అందరికీ ఒకేలా న్యాయం చేయాలని స్థానికులు కోరారు. అనంతరం డీఈ విజయ్ సారథి విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు విషయంలో ప్రజల నుంచి అభ్యంతరాలు ఉన్నందున నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులను కోరుతామన్నారు. అప్పటి వరకు విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను విద్యుత్ పనులను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఎల్లారెడ్డి ఏడీఈ సుదర్శన్‌రెడ్డి, స్థానిక లైన్‌మన్, ఇన్‌స్పెక్టర్ సురేందర్, లైన్‌మెన్ శశికాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సాయి భక్తుల పాదయాత్ర

మద్నూర్, అక్టోబరు 3 : మండల కేంద్రం నుంచి సాయిబాబా టెంపుల్ వరకు భక్తులకు పాదయాత్రతో బయలుదేరి వెళ్లారు. ప్రతీ ఏడాది నవరాత్రుల్లో భాగంగా ఉమ్మడి మద్నూర్ మండలం నుంచి భక్తులు పాదయాత్ర ద్వారా బీర్కూర్ మండలం నెమ్లి సాయిబాబా ఆలయం వరకు పాదయాత్రగా వెళ్లి దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా బుధవారం పలువురు పాదయాత్రతో ఆలయానికి బయలుదేరి వెళ్లారు. వారికి మధ్యలో మండల కేంద్రానికి చెందిన వ్యాపార వేత్త సంతోష్ అల్పాహార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



మద్నూర్ నుంచి నెమ్లి వరకు పాదయాత్రగా వెళుతున్న సాయి భక్తులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

థియేటర్	సినిమా
శాంతి	సరిపోదా శనివారం
దర్శన్	ఏఆర్ఎమ్
ప్రియా 35	మత్తు వదలరా-2

బాన్సువాడ

థియేటర్	సినిమా
మహేశ్వరి	దేవర
వెంకటేశ్వర	సత్యం సుందరం

చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190